భారత ఆర్థిక వ్యవస్థ...వివిధ రంగాలు.. పరిశీలన

గత రెండు దశాబ్దాల్లో స్థూల దేశీయోత్పత్తిలో వివిధ రంగాల వాటాలను పరిశీలిస్తే.. సేవారంగ ప్రాధాన్యత క్రమంగా పెరుగుతోంది. అయితే సేవారంగం ఎగుమతుల వృద్ధిని పరిశీలకులు శుభ పరిణామంగా భావిస్తున్నప్పటికీ.. స్థూల దేశీయోత్పత్తిలో సేవారంగం వాటా పెరుగుదల పట్ల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భౌతిక వస్తువులను స్థిర మూలధనంగా, వేతన వస్తువులుగా(wage goods) వినియోగించినప్పుడే ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుందని ఆడమ్‌స్మిత్ అభిప్రాయపడ్డారు. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో కీలక రంగాలైన ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాల సాపేక్ష వాటాను పరిశీలించినపుడు.. ఆర్థిక వ్యవస్థలో అంతిమ డిమాండ్‌లో మార్పుతో పాటు ఆయా రంగాల వాటాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి.



వ్యవసాయం, పశుపోషణ, చేపల వేట, గనులు, క్వారీయింగ్ లాంటి కార్యకలాపాలు ప్రాథమిక రంగం పరిధిలోనివి. ద్వితీయ రంగంలో తయారీ రంగం, నిర్మాణ రంగం, విద్యుచ్ఛక్తి, గ్యాస్, నీటి సరఫరా వంటి అంశాలుంటాయి. తృతీయ రంగాన్ని మాధ్యమిక, అంతిమ సేవలు అందించే రంగంగా భావించవచ్చు. 1950 తర్వాత వాణిజ్యం, హోటళ్లు, రెస్టారెంట్లు తృతీయ రంగంలో ప్రధాన కార్యకలాపాలుగా మారాయి.గత పది సంవత్సరాలుగా రవాణా, స్టోరేజీ, కమ్యూనికేషన్ల వాటా పెరుగుతూ వస్తోంది. వీటి తర్వాత స్థానాన్ని కంప్యూటర్ సంబంధిత వ్యాపార(ఐటీ) సేవలు ఆక్రమిస్తున్నాయి. 1950-51లో తృతీయ రంగంలో మాధ్యమిక సేవల వాటా 40 శాతం కాగా 1995-96 తర్వాత కాలంలో ఇది 50 శాతానికి పైగా పెరిగింది. గత నాలుగున్నర దశాబ్దాల్లో మాధ్యమిక సేవల వృద్ధి, అంతిమ సేవల వృద్ధి కంటే ఎక్కువగా నమోదైంది. 1950 లో దేశ జాతీయ ఆదాయంలో ప్రాథమిక రంగందే అధిక వాటా. కాగా తర్వాతి కాలంలో ద్వితీయ, తృతీయ రంగాల వాటా క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సేవా రంగం వాటా 60 శాతానికి చేరుకుంది. ఈ విధంగా జాతీయాదాయంలో ప్రాథమిక రంగ వాటా తగ్గుతూ ద్వితీయ, తృతీయ రంగాల వాటా పెరగడాన్ని ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక మార్పుగా భావించవచ్చు.

జాతీయాదాయ వృద్ధి:

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత 1980-2000 మధ్య కాలంలో జాతీయాదాయం పెరుగుదలలో అత్యధిక వృద్ధి నమోదైంది. 1980ల మధ్యలో ప్రవేశపెట్టిన పరిమిత మైన సంస్కరణలు, విస్తరణ కోశ విధానాలు జాతీయాదాయ వృద్ధికి దోహదం చేశాయి. వాణిజ్యం, పారిశ్రామిక కార్యకలాపాలపై నియంత్రణ.. తర్వాత కాలంలోనూ కొనసాగింది. ద్రవ్యలోటు పెరిగి విదేశీ వాణిజ్య ప్రగతి తగ్గి 1991 లో వ్యాపార చెల్లింపుల శేషంలో తీవ్ర సంక్షోభం ఏర్పడింది. సంస్కరణలను అమలు చేయడం ప్రారంభించిన తర్వాత ఆర్థిక వ్యవస్థలో.. 1995-96 నుంచి 1997-98 మధ్య కాలంలో 7.5 శాతం సగటు వార్షిక వృద్ధి నమోదైంది. 2003-04 నుంచి 2006-07 మధ్య కాలంలో 8.5 శాతం వార్షిక వృద్ధి సాధ్యమైంది. పదో పంచవర్ష ప్రణాళికలో సాధించిన సగటు వృద్ధి 7.6 శాతం. ఇది మిగతా అన్ని ప్రణాళికల్లో సాధించిన వృద్ధి కంటే ఎక్కువ. ఇదే ప్రణాళికలో తలసరి స్థూల దేశీయోత్పత్తి వృద్ధి 6 శాతం. అంతేకాకుండా సంస్కరణల యుగం స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని చవి చూసింది. ఈ కాలంలో ఎక్కువ భాగం తక్కువ ద్రవ్యోల్బణం, స్థిర వినిమయరేటు, సరిపడ విదేశీ మారక నిల్వలు, ఆహారధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల వంటి ప్రయోజనకర అంశాలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా నెలకొని ఉన్న ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో.. భారత ఆర్థిక వ్యవస్థలో వృద్ధిరేటు ఆశించినంతగా లేదు. అయినప్పటికీ భారతదేశం కొనుగోలు శక్తి సామ్యర్థ్యం (PPP) ఆధారంగా 2030నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకోగలదని పరిశీలకుల అంచనా.

వ్యవసాయం:

1970-71 తర్వాత వ్యవసాయ ఉత్పత్తి సూచీ సంఖ్య 120 శాతం మేర పెరిగింది. స్థల(ఏరియా) విస్తీర్ణం కంటే హెక్టారుకు దిగుబడిలో పెరుగుదలే దీనికి కారణమైంది. ఇటీవల కాలంలో ముఖ్య పంటలు సాగుచేసే భూ విస్తీర్ణంలో కొంత మార్పు చోటు చేసుకుంది. ఆహార పంటల కోసం వినియోగిస్తున్న భూమిని ఆహారేతర పంటలకు కేటాయించడమే ఇందుకు కారణం. ఆహారధాన్యాల ఉత్పత్తి వృద్ధి ఇటీవల కాలంలో అధికమవడానికి హెక్టారుకు వచ్చిన దిగుబడిలో పెరుగుదలే కారణం. 1970-71తో పోల్చినపుడు 2005-06లో ఆహారేతర పంటల కింద ఉన్న విస్తీర్ణం 50 శాతం మేర పెరిగింది. ఇదే కాలంలో

పట్టిక: 1999-2000 ధరల వద్ద GDP at factor costలో వివిధ రంగాల వృద్ధి

అంశం	2003-04	2007-08	2008-09
వ్యవసాయం, అడవులు, చేపల వేట	10.0	4.9	1.6
మైనింగ్, క్వారీయింగ్	3.1	3.3	3.6
తయారీ రంగం	6.6	8.2	2.4
విద్యుచ్ఛక్తి, గ్యాస్, వాటర్ సప్లయ్	4.8	5.3	3.4
నిర్మాణ రంగం	12.0	10.1	7.2
వాణిజ్యం, హోటళ్లు, రెస్టారెంట్లు	10.1	10.1	-
రవాణా, స్టోరేజ్, కమ్యూనికేషన్	15.3	15.5	-
ఫైనాన్సింగ్, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్, వ్యాపార సేవలు	5.6	11.7	7.8
కమ్యూనిటీ, సాంఘిక, వ్యక్తిగత సేవలు	5.4	6.8	13.1
మొత్తం జీడీపీ ఎట్ ఫ్యాక్టర్ క్యాస్ట్	8.5	9.0	6.7

ఆధారం: కేంద్ర గణాంక సంస్థ

హెక్టారుకు దిగుబడి లో 70 శాతం వృద్ధి నమోదైంది.

1990 తర్వాత ఆహార, ఆహారేతర వ్యవసాయ ఉత్పత్తుల్లో తగ్గుదల సంభవించింది. ఈ తగ్గుదల ఆహార ధాన్యాల్లో ఎక్కువగా నమోదైంది. డిమాండ్‌లో వచ్చిన మార్పులకు అనుగుణంగా పంటల తీరులోను మార్పు స్పష్ట మవుతోంది. ఆహారధాన్యాల స్థూల ఉత్పత్తి 1980- 81లో 130 టన్నులు. కాగా.. 2008-09లో ఇది 229 మిలియన్ టన్నులకు పెరిగింది. ఈ ఉత్పత్తి సగటు వృద్ధి 1.8 శాతం. తలసరి ఆహారధాన్యాల నికర లభ్యతలో ఒడిదుడుకులు ఏర్పడ్డాయి. తక్కువ ఆదాయ వ్యాకోచత్వం ఉన్నపుడు ఆహారధాన్యాల స్వదేశీ డిమాండ్ పెరుగుదల భవిష్యత్‌లో నెమ్మదిగా ఉండగలదు. మరోవైపు ఆహారేతర పంటల్లో అధిక వృద్ధి సాధ్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

1980లలో వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గడం తోపాటు సంస్కరణల కాలంలో వ్యవసాయ రంగంలో వృద్ధి మందగించింది. దీంతో ఈ రంగానికి చేయూతనందించేందుకు చేపట్టాల్సిన ఆవశ్యక చర్యలను ఈ అంశాలు సూచిస్తున్నాయి. ప్రపంచంలో ఇటీవల కాలంలో పాల ఉత్పత్తిలో అతిపెద్ద ఉత్పత్తిదారునిగా భారత్ అవతరించింది. తలసరి పాల లభ్యత రోజుకు 1980-81 లో 128 గ్రాములు. కాగా.. ఇది 2005-06లో 241 గ్రాములకు చేరుకుంది.

పారిశ్రామిక రంగం:

స్వాతంత్ర్యానంతరం దేశంలో పారిశ్రామికీకరణ ఎక్కువ గా ప్రభుత్వ రంగంలోనే చోటు చేసుకుంది. రెండో పంచ వర్ష ప్రణాళికలో (1956-61) భారీ పారిశ్రామికీకరణను లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ ప్రణాళికను మహలోనబిస్ అభివృద్ధి వ్యూహంగా పేర్కొన్నారు. 1977 పారిశ్రామిక తీర్మానం ద్వారా చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. 2006-07లో మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో 39 శాతం, పారిశ్రామిక ఎగుమతుల్లో 34 శాతం, తయారీ, సేవల యూనిట్లలోని మొత్తం ఉద్యోగితలో 35 శాతం వాటా సూక్ష్మ, చిన్నతరహా సంస్థలదే. 2008-09లో ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా ఈ రంగానికి రూ.1,90,958 కోట్ల పరపతి అందించారు.

2007-08లో దేశంలో పారిశ్రామిక రంగ వృద్ధిరేటు 8.5 శాతంగా నమోదైంది. 2008-09లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం కారణంగా పారిశ్రామిక రంగంలో వృద్ధి 2.4 శాతం మాత్రమే. 2008-09లో పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో మూలధన వస్తువుల ఉత్పత్తి వృద్ధి 7 శాతం కాగా వినియోగ వస్తువుల ఉత్పత్తి వృద్ధి 4.4శాతం. 1980 లలో వృద్ధి ప్రక్రియకు మూలధన వస్తు రంగం ఎంతో చేయూతనిచ్చినప్పటికీ 1990వ దశకంలో ఈ రంగంలో వృద్ధి తగ్గింది. అనశ్వర వినియోగ వస్తువుల పెరుగుదలకు పరపతి సౌకర్యాల లభ్యత, వ్యయార్హ ఆదాయం (disposable income)లో పెరుగుదల దోహదం చేసింది.

సేవల రంగం:

1950లో జాతీయాదాయంలో సేవా రంగం వాటా 28.5 శాతం కాగా ప్రస్తుతం ఇది 60 శాతానికి చేరుకుంది. అవస్థాపనా సౌకర్యాల్లో స్థూల మూలధన కల్పన జీడీపీలో 2006-07లో 5 శాతం కాగా.. 2011-12 నాటికి 9 శాతం లక్ష్యంగా 11వ పంచవర్ష ప్రణాళిక నిర్దేశించుకుంది. ఈ ప్రణాళికలో అవస్థాపనా సౌకర్యాలపై 502.88 బిలియన్ డాలర్లను పెట్టుబడి రూపంలో వెచ్చించగలరని పరిశీలకుల భావన. దీనిలో ప్రైవేటు రంగ పెట్టుబడి 30 శాతం మేర ఉండగలదని అంచనావేస్తున్నారు. మౌలిక సౌకర్యాల్లో ప్రభుత్వ రంగ పెట్టుబడులను ప్రోత్సహించడానికి ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ అనే సంస్థను ఏర్పాటు చేశారు. 2000 తర్వాత సేవల రంగంలో.. అధిక శాతం రంగాలు (segments) 6 శాతం కంటే ఎక్కువ వృద్ధిని నమోదు చేసుకుంటున్నాయి. సేవల రంగంలో అతిపెద్ద అంశమైన వాణిజ్యం వాటా జీడీపీలో 1/7వ వంతు ఉంటోంది. వాణిజ్య రంగం సగటు వృద్ధి 8 శాతం. రియల్ ఎస్టేట్, వ్యక్తిగత సేవలు, రైల్వేతర రవాణా (nonrailway transport) సాధిస్తున్న వృద్ధి ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు కంటే ఎక్కువ. రైల్వే, బ్యాంకింగ్ రంగాలు సగటున జీడీపీలో 6 శాతం వృద్ధిని నమోదు చేసుకుంటున్నాయి. ఒకే విధమైన అభివృద్ధి దశలో జీడీపీలో సేవల వాటా ఇత ర దేశాల కంటే భారత్‌లో ఎక్కువ. జాతీయాదాయానికి ఈ రంగం ఎక్కువవాటాను సమకూరుస్తున్నప్పటికీ... మొత్తం వృత్తులవారీ శ్రామికశక్తి పంపిణీలో ఈ రంగం వాటా 22 శాతంగా ఉండటం ఆర్థికవేత్తల విమర్శలకు గురైంది.

ముఖ్యాంశాలు:

- కొనుగోలు శక్తి సామర్థ్యం ఆధారంగా 2030 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపొందగలదని UNCTAD అభిప్రాయపడింది.
- 1950లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య 5.
- 2008-09లో పారిశ్రామిక రంగంలో మూలధన వస్తువుల ఉత్పత్తి వృద్ధిరేటు ఎక్కువ.
- 2008-09లో కమ్యూనిటీ, సాంఘిక, వ్యక్తిగత సేవల వృద్ధి 13.1

శాతం.

- 2008-09లో జీడీపీ (ఉత్పత్తి కారకాల ధరల వద్ద) లో వృద్ధి 6.7 శాతం.
- జాతీయాదాయంలో సేవారంగం వాటా ఎక్కువ.
- 11వ ప్రణాళికలో అవస్థాపనా సౌకర్యాలపై పెట్టుబడి 502.88 బిలియన్ డాలర్లని అంచనా.
- మౌలిక సౌకర్యాలపై పెట్టుబడులు పెంచడానికి ప్రభుత్వ రంగంలో 'ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్'ను ఏర్పాటు చేశారు.